క్లుప్తంగా

విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్ ఏర్పాటు

మాచర్ల: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం మాచర్ల విద్యుత్తు కార్యాలయంలో ఆదివారం కూడా బిల్లులు చెల్లించడానికి కౌంటర్ ఏర్పాటు చేసినట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య శనివారం తెలిపారు. ఇల్లు, వ్యాపారాలు, అగ్రికల్చర్, ఇతర కేటగిరీలకు సంబంధించిన పాత బకాయిలతోపాటు, ప్రస్తుత విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఆయన సూచించారు.

నేడు జానపాడులో ఉచిత టీకా శిబిరం

పిడుగురాళ్ల: ఆయు ఫౌండేషన్, ఉన్నం హాస్పిటల్ సహకారంతో గర్భాశయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత టీకా శిబిరాన్ని ఆదివారం జానపాడులో ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, 100 మందికి ఉచితంగా టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి డోస్ వేయించుకున్న వారికి మాత్రమే వేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డిజిటల్ సేవలపై చిరు వ్యాపారులకు అవగాహన



పిడుగురాళ్ల: పేదరికం నుంచి బయటపడటానికి చిరు వ్యాపారులు కృషి చేయాలని మెప్మా అధికారి సీఎంఎం శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద పేదరిక నిర్మూలన కార్యక్రమంపై లోక్ కల్యాణ మేళాను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా చిరు వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలు, రుణాల సద్వినియోగం, చెల్లింపులు, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించారు. అనంతరం చిరు వ్యాపారులకు డిజిటల్ బోర్డులను వినియోగించే విధానాన్ని తెలియజేసి, క్యూఆర్ కోడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. జాబ్ మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయని ఆయన పేర్కొన్నారు. 178 మంది అభ్యర్థులు హాజరు కాగా, 71 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఉద్యోగాలు చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం. రవీంద్రా నాయక్, వీరాంజినేయులు, అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయాలి

దాచేపల్లి : కొత్త జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని డీఎల్‌డీవో గబ్రూ నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్యుడికి ప్రయోజనకరంగా ఉండేలా కొత్త జీఎస్టీ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు అర్థమయ్యేరీతిలో వివరించాలని ఆయన చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస యాదవ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాలి

నరసరావుపేట: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాలని ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగమల్లేశ్వరావు అన్నారు. దివంగత ఉద్యోగ సంఘాల నేత తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని రెవెన్యూ భవన్‌లో ఆయన చిత్రపటానికి వీఆర్‌ఓల జిల్లా అధ్యక్షులు రామారావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.



గుండ్లపాడు సచివాలయం వద్ద శ్రీ ధనలక్ష్మీదేవి అవతారం



పాలువాయి జంక్షన్‌లో సంతానలక్ష్మి అలంకారం



సత్రశాలలో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అలంకారం



రెంటచింతల శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మాత



రెంటచింతలలో శ్రీ సంతానలక్ష్మి అలంకారం



దాచేపల్లిలో మహాలక్ష్మీ అలంకరణలో ఉన్న అమ్మవారికి పూజలు



నారాయణపురంలో బతకమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



నారాయణపురంలో అమ్మవారి విగ్రహం వద్ద వేషధారణలో చిన్నారులు



పిడుగురాళ్ల కనక దుర్గమ్మ వారి దేవాలయంలో కుంకుమ పూజలు

నానా భూషిత అలంకారే.. నమస్తుతే !

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవాలయాల్లో అమ్మవారు పలు అవతారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కుంకుమార్చన, లోక కల్యాణార్థం శక్తి హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు అమ్మవారి సహస్రనామ పూజలు చేపట్టారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

–వెల్దుర్తి/ రెంటచింతల/ పిడుగురాళ్ల/ దాచేపల్లి



రెంటచింతల శ్రీ వాసవీవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బతకమ్మ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు.



ప్రత్యేక అలంకరణలో పిడుగురాళ్ల నాగుల గుడిలోని అమ్మవారు



పిడుగురాళ్ల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెల్లువెత్తిన అభిమానం



కార్యకర్తలకు కరచాలనం చేస్తున్న పీఆర్కే



కార్యకర్తలకు కరచాలనం చేస్తున్న పీవీఆర్

- మాచర్లకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పీఆర్కే, పీవీఆర్, మాజీ సీఎం జగన్‌లకు జేజేలు

మాచర్ల: నియోజక వర్గంలోని గుండ్లపాడు గ్రామానికి సంబంధించిన అక్రమ హత్య కేసులో పోలీసుల విచారణకు శనివారం వచ్చిన వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను చూసేందుకు వందలాది మంది ఉదయం నుంచి మాచర్లకు తరలివచ్చారు. పీఆర్కే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అభిమానులు, కార్యకర్తల సందడి నెలకొంది. పీఆర్కే, పీవీఆర్, మాజీ సీఎం జగన్‌లకు జేజేలు పలికారు. కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, మాచర్ల, రెంటచింతల మండలాలలోని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పీఆర్కే, పీవీఆర్‌లకు పుష్పగుచ్ఛాలు అందించారు. మహిళలు భారీ స్థాయిలో వచ్చి పలకరించారు. రాబోయే రోజులు మనవేనంటూ వారికి అభినందనలు తెలిపారు. ఎటుచూసినా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పీఆర్కే క్యాంపు కార్యాలయంలో సందడి నెలకొంది.

ట్రిపుల్ ఐటీకి మాచర్ల విద్యార్థి ఎంపిక

మాచర్ల: స్పోర్ట్స్ కోటాలో నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజీకి స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థి అలేటి కార్తిక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాత శనివారం కార్తిక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు, మాచర్ల పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిస్టర్ శ్వేత, పీఈటీ కుమార్, పాఠశాల సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ ఎం.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్తిక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాత, అధ్యాపకులు

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

శావల్యాపురం: శావల్యాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో డ్రైవరుకు గాయాలైన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు నంద్యాల నుంచి విజయవాడకు పశువుల దాణా కట్టల లోడుతో బయలుదేరింది. కోల్‌కత్తా నుంచి నంద్యాల జిల్లా నంది కొట్కూరు వైపు బొగ్గు లోడుతోబయలుదేరింది. శావల్యాపురం కొంకెరు వాగు సమీపాన రెండు లారీలు ఢీకొన్నాయి. ఘటనలో పశువుల దాణా లోడు లారీ డ్రైవరు రమేష్‌కు గాయాలయ్యాయి. అత్యవసన వైద్యసేవల కోసం వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిషేధిత గడ్డి మందు స్వాధీనం

నరసరావుపేటరూరల్: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గడ్డి మందు గ్లెసైల్‌ను వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయంలో శనివారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీఏ వి.హనుమంతరావు, వ్యవసాయ అధికారులు ఐ.శాంతి, శ్రీలతలు పాల్గొన్నారు. పల్నాడు ట్రాన్స్‌ఫోర్ట్ గోడౌన్‌లో నిషేధిత గడ్డి మందు గ్లెసైల్‌ను అధికారులు గుర్తించారు. తొమ్మిది కాటన్ బాక్స్‌లోని రూ.1.47,700 విలువైన 180 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన స్టాక్‌ను తదుపరి చర్యలు కోసం నిలుపుదల చేస్తూ ట్రాన్స్‌ఫోర్ట్ యజమానికి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం నిషేధించిన గ్లెసైల్ గడ్డి మందును జిల్లాలో విక్రయిస్తే సంబంధిత దుకాణంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ హెచ్చరించారు.

జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు

పిడుగురాళ్ల: జీఎస్టీ తగ్గుదలతో మధ్యతరగతి కుటుంబాలకు ఎంతగానో మేలు జరిగిందని సీటీవో కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ పి. నారాయణశాస్త్రి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణశాస్త్రి మాట్లాడుతూ రోజు వారి ఉపయోగించే నిత్యావసర సరుకులు, బ్యాకరీ ఉత్పత్తులు, ప్యాకేజీ ఫుడ్స్.. ఇలా పలు రకాలపై దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్ను తగ్గడంతో ధరలు తగ్గాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపును ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ శ్రీనివాసులు, జీఎస్టీ ఆఫీసర్ పీటర్ బాబు, వ్యాపారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ నారాయణ శాస్త్రి

నిర్విరామ శ్రమయే విజయ రహస్యం



వినుకొండ: నిర్విరామంగా శ్రమిస్తే విజయం సొంతమవుతుందని స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.సీ తారాంబాబు అన్నారు. డీఎస్సీ 2025లో తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని టీచర్ ఉద్యోగాలు పొందిన రావిపాటి అంజలీదేవి, కంచర్ల శ్రీనివాసరావు, షేక్ కరీ మున్నిసాబేగం, ఎం.జ్యోతిలను శనివారం సత్కరించారు.